

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు టీ రాజయ్య, రెడ్యానాయక్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి

## బీఆర్ఎస్ అధినేతకు పరామర్శ

**ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఉమ్మడి జిల్లా నేతలు**
**త్వరగా కోరుకోవాలని ఆకాంక్ష**

వరంగల్ డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లా నేతలు మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ధరంసోత్ రెడ్యానాయక్, తాటికొండ రాజయ్య తదితరులున్నారు.



జనగామ జిల్లా బచ్చన్నపేటలో రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు

# కాంగ్రెస్ సర్కారు మా పొట్టకొట్టింది

- వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం రద్దు చేయాలి
- జనగామ జిల్లా బచ్చన్నపేట చౌరస్తాలో రాస్తారోకో చేసి నిరసన తెలిపిన ఆటోడ్రైవర్లు

బచ్చన్నపేట, డిసెంబర్ 12 : కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చి తమ పొట్ట కొట్టిందని, దీని వల్ల 300 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆటోడ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆలేరు, జనగామ, చేర్యాల, కొన్నె గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది ఆటోడ్రైవర్లు ప్రభుత్వ తీరుకు నిరసనగా రాస్తారోకో చేశారు. దీంతో జనగామ, ఆలేరు, సిద్దిపేట వైపు వెల్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల సంఘం అధ్యక్షుడు పస్తం అయిలయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించాల్సిన ప్రభుత్వం ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టడం సమంజసం కాదన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితంగా ప్రయాణం అని ప్రకటించడంతో తమ ఆటోల్లో ఒక్కరు కూడా ఎక్కడం లేదని, రోజంతా అడ్డాలపై వేచివేచి విసుగు చెందుతున్నామని, కనీసం పూట గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పథకాలు పెట్టాలే కానీ రోడ్డున పడేసే పథకాలు మాకొద్దని, ప్రభుత్వం పునారాలోచించి ఆ పథకాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు అప్పోసప్పో చేసి ఆటోలు ఫైనాన్స్‌లో కొనుగోలు చేసుకుని కుటుంబాలు వెల్లదీస్తున్నారని ఆన్నారు. ఫ్రీ బస్సు సౌకర్యంతో కనీసం ఫైనాన్స్ కడుదామన్న ఒక్క ట్రిప్పు కూడా నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమానికి దృష్టిలో పెట్టుకుని ఫ్రీ బస్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిడి అయిలయ్య, దూడల సిద్దులు, జూకంటి గణేశ్, కంటెం కనుకయ్య, సందెల లక్ష్మణ్, బొలుగుల లక్ష్మణ్, ఎండీ యాకూబ్‌పాషా, సిరిపాటి అయిలయ్య, ఎద్దు రమేశ్, తవిటె భాస్కర్, సిద్దులు, కనకయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనుచరులను శిక్షించాలి

- ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధం
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిలాఫలకం ధ్వంసం చేయడంపై సీపీకి ఫిర్యాదు



మేయర్‌తో కలిసి సీపీకి ఫిర్యాదు చేస్తున్న వినయ్‌భాస్కర్

సుబేదారి,డిసెంబర్ 12: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులను కఠినంగా శిక్షించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ కోరారు. ఇటీవల హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభ శిలఫలకాన్ని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనపై మంగళవారం ఆయన సీపీ అంబర్ కిశోర్ ఝాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ 2018 మార్చి 5వ తేదీన ప్రారంభించారని పేర్కొన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలోకి వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యంగా క్యాంపు కార్యాలయ ప్రారంభ శిలాఫలకాన్ని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా రాజ్యాంగ విరుద్ధమని వినయ్‌భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సీపీని కోరారు. వరంగల్ ఎమ్మెల్యేగా పదిహేను సంవత్సరాలు పనిచేసిన తాను కానీ, తన అనుచరులు కానీ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఈ ఎన్నికల్లో ఓడినా ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం అనేది రాజకీయ ప్రతీకారాలకు నిదర్శమని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుధారాణి సీపీని కోరారు. దాస్యం వెంట కుడా మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్, మర్రి యాద వరెడ్డి, కార్పొరేటర్ నర్సింగ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జనార్దన్ గౌడ్ ఉన్నారు.



కోనేరులో గంగా హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

## వేయిస్తంభాల దేవాలయంలో 'గంగాహారతి'

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం లో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో కోనేరులో గంగాహారతి నిర్వ హించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ నిత్యాహ్నిక కార్యక్రమాలు, నెలరోజులుగా నిర్వహిస్తున్న లోకకళ్యాణార్థం రుద్రయాగం ముగించి మహా పూర్ణాహుతి చేశారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించుకొని మహిళలందరూ కోనేరులో అరటిదీపాలు వదిలి ఉపవాస దీక్ష విరమించారు. కార్యక్రమంలో అర్చకులు సందీప్‌శర్మ, మేఘనాథాచార్యులు, మణికంఠశర్మ పూజలు నిర్వహించగా, కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ నిరంజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఉండాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, మన బలాలపై మనకు నమ్మకం, విశ్వాసం ఉండాలని అన్నింటికి మించి మానసిక బలం గొప్పదని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో మంగళవారం యూనివర్సిటీ దివ్యాంగుల సెల్ సంచాలకులు డాక్టర్ ఏ రాజు అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని వీసీ రమేశ్ మాట్లాడుతూ దివ్యాంగులు తమ బలాలను, ప్రతిభను నమ్ముకోవాలని, లక్ష్యం గొప్పగా ఉండాలన్నారు. నైరాశ్యం విడనాడాలని, జయాపజయాలు నువ్వే కారణమన్నారు. ఈ సందర్భంగా స్టీఫెన్ హక్కిన్స్, బాలలత, ఆచార్య నాగేశ్వర్‌ను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ యూనియన్, హంగేరి దేశానికి చెందిన బయోలాజికల్ రిసెర్చ్ సెంటర్ ఆచార్య లాసజోల్ సజ్బదోస్ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని వదులుకోవద్దని, సమస్యలపై కాకుండా పరిష్కారాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఐటీ ఆచార్య పోరిక రామ్‌లాల్ మాట్లాడుతూ అంగవైకల్యం దేనికి అడ్డంకి కాదని, లక్ష్యం పెద్దగా ఉండాలన్నారు, లక్ష్య సాధనలో వచ్చే అవరోధాలకు భయపడవద్దని, తన జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలు, ఎలా తన లక్ష్యాన్ని చేరుకున్నది వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ టీ శ్రీనివాసరావు, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, విశ్వవిద్యాలయ వికలాంగుల సంఘ అధ్యక్షుడు సాంబశివరావు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రమేశ్



అదాలత్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న తపాలా శాఖ ఉద్యోగులు

# సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులు

హనుమకొండ, డిసెంబర్ 12: గ్రామీణ తపాలా ఉద్యోగులకు నియమించిన కమలేశ్‌చంద్ర కమిటీలోని అనుకూల సిఫారసును అమలు చేయనందుకు నిరసనగా తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు మంగళవారం హనుమకొండ పోస్టల్ డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పనిని గుర్తించి, సివిల్ సర్వెంట్ హోదా కల్పించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైల్వే యూనియన్ నాయకులు కర్ర యాదవరెడ్డి, హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు కొమురారెడ్డి, ఎస్ ఎల్లయ్య, తిరుపతి, ఆనందం, జీ లక్ష్మీనారాయణ, కే నిర్మల, ఎండీ హుస్సేన్, కిషన్ ప్రసాద్, ఎండీ షఫియుద్దీన్, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోహర్, బాపూజీ పాల్గొన్నారు.